

చెక్‌పోస్టులు తప్పించుకుని..

ఇసుక అక్రమ రవాణా నియంత్రణ కోసం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సరిహద్దు ప్రాంతాల్లో పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వసుంధర, పాతపట్నం వంతెన వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీసు నిఘా పెట్టారు. దీంతో అక్రమార్కులు కొత్తూరు, హిరమండలంలోని వంశధార నదుల నుంచి ఇసుక లోడ్ చేసి.. పాతపట్నం మీదుగా ఆల్ ఆంధ్రా రహదారిపై నుంచి మెళియాపుట్టి మూడురోడ్ల జంక్షన్‌కు చేరుకుంటున్నారు. అక్కడి నుంచి మహేంద్రతనయ నది పక్కదారి గుండా ఒడిశాకు ఇసుకను తరలిస్తున్నారు. ఒడిశా రిజిస్ట్రేషన్ ట్రాక్టర్ల ద్వారా అధికమొత్తంలో ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. పోలీసులు, అధికారులు మరింత దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

- అధికారపార్టీ నేతలకు ఒడిశా వ్యాపారుల ఆఫర్
- సరిహద్దు రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ రవాణా
- అడ్డదారుల్లో తరలింపు.. అధిక ధరకు విక్రయాలు
- ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న కొందరు తమ్ముళ్లు

ఎంత కావాలో చెప్పండి!

మాకు ఇసుక ఇస్తే.. మీకు ఎంత కావాలో చెప్పండి. మీరు ట్రాక్టర్లలోకి ఇసుక లోడ్ చేస్తే చాలు. తరలించే బాధ్యత మేమే చూసుకుంటాం.

- ఇదీ అధికారపార్టీ నేతలకు ఒడిశాకు చెందిన ఇసుక వ్యాపారులు ఇచ్చిన ఆఫర్. ముందుగా వారు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. రోజూ ఆంధ్రాలోని సరిహద్దు రేవుల నుంచి ఇసుకను అక్రమంగా ఒడిశాకు తరలిస్తున్నారు. వారు సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు.



నివగాం రీచ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలు

మెళియాపుట్టి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. ఒడిశా వ్యాపారులు ముందుగా ఇక్కడి అధికారపార్టీ నేతలతో బేరసారాలు కుదుర్చుకుని ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఎంత డబ్బులు కావాలన్నా ఇస్తామని, ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేస్తే.. రవాణా బాధ్యత తాము చూసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. కాగా వైసీపీ పాలన మాదిరి ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం.. సీనరేజ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా వదులుకుంది. నిర్ణీత ధరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోంది. కాగా.. కొంతమంది అధికారపార్టీ నాయకులు మాత్రం ఇసుకరేవులను కల్పవృక్షాలుగా మార్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● పాతపట్నం నియోజకవర్గంలో ఆకులతంపర, నివగాం వద్ద ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాగా.. ఈ రీచ్‌ల్లో ఇసుకను కొంతమంది ఒడిశాకు అధికంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రీచ్‌ల వద్ద యంత్రాలతో ఇసుకలోడ్ చేసినవారికి డబ్బులు ఎర చూపి.. ఒడిశాకు రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, ట్రిప్పర్లతో అడ్డదారుల్లో అక్రమ రవాణా చేస్తున్నారు. పాతపట్నం ఆల్ ఆంధ్రా రోడ్డు నుంచి

(మిగతా 6వ పేజీలో..)



ఆల్‌ఆంధ్రా రోడ్డులో
ఒడిశా ట్రాక్టర్‌తో తరలిస్తున్న ఇసుక



రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

- జిల్లాలో నరసన్నపేట కేంద్రంలోనే నిర్వహణ
- పరీక్షలు రాయనున్న సుమారు 4 వేల మంది
- నిర్ణీత సమయానికి రెండు గంటల ముందే చేరుకోవాలి

6లో

దారీ లేదు.. నీరూ లేదు!

- వైద్యానికి ఇప్పటికీ డోలీలే దిక్కు
- ఇదీ కె.తాళభద్ర వాసుల దుస్థితి

6లో

పాడి పోషణకు చేయూత

- గ్రామాల్లో పశు వైద్యశిబిరాల నిర్వహణ ప్రారంభం
- ఉచితంగా పరీక్షలు, టీకాలు, మందుల పంపిణీ
- రూ.95.36 లక్షల నిధులు విడుదల



మబుగాంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పశుసంపద, పాడి పెంపకంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది, ఉచితంగా గ్రాసం పెంపకానికి ఉపాధి నిధులు సమకూర్చుతోంది. పశువులు, గొర్రెలు, మేకలు వంటి మూగజీవాల కోసం పెంపకందారులకు 90 శాతం రాయితీపై మినీ గోకులాలు నిర్మిస్తోంది. తాజాగా సోమవారం నుంచి గ్రామాల్లో పశు వైద్య శిబిరాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఈ నెలాఖరు వరకూ గ్రామీణ పశువైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల వద్ద పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనుంది. దీంతో పాడి రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

● జిల్లాలో 3,75,345 ఆవులు, గేదెలు, 45,914 దూడలు, 7,19,985 గొర్రెలు, మేకలు ఉన్నట్లు పశుసంవర్థశాఖ అధికారులు తెలిపారు. సోమవారం పశువైద్య శిబిరాలు ప్రారంభించారు. ప్రతి మండలంలోని రెండు గ్రామాల్లో ఈ నెల 31 వరకూ శిబిరాలను నిర్వహించనున్నారు. శిబిరాల్లో పశువైద్య అధికారి, ఇద్దరు సహాయకులు, ఒక అటెండర్ ఉంటారు. జిల్లాలో 92 పశుకేంద్రాల వైద్యులు, 358 రైతుసేవాకేంద్రాల సిబ్బంది ద్వారా సేవలు అందించనున్నారు. మూగజీవాలకు వైద్య పరీక్షలతోపాటు శస్త్రచికిత్సలు, అవసరమైన మందులు ఉచితంగా ఇస్తారు. గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం అందించనున్నారు. పశువులు, చిన్న దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు ఉచితంగా ఇస్తారు. పశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేయనున్నారు.

● ఏలికపాము నివారణ ప్రధాన ఉద్దేశంగా పశువులకు ముందుగా మందులను అందిస్తున్నారు. పాల ఉత్పత్తి పెంచడం, గొర్రెలు, మేకలు, కోళ్ల తదితర వాటికి మాశూచి నివారణ మందులు కూడా పంపిణీ చేస్తున్నారు. ఏలికాపాముల నివారణకు ప్రభుత్వం రూ.95.36 లక్షల నిధులను మంజూరు చేసింది. వీటి నివారణ ద్వారా పశువులు ఆహారం తీసుకోవడంతోపాటు ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. పాడి పశువులకు పాల ఉత్పత్తి పెరుగుతుంది. మేకలు, గొర్రెలలో ఎదుగుదల పెరిగి మాంసం దిగుబడి ఎక్కువవుతుంది.

11 రోజలపాటు శిబిరాలు



పాడి పరిశ్రమకు చేయూతనిచ్చేందుకు జిల్లాలో 11 రోజులపాటు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. రైతులకు పాడిపశువులు పెంపకంపై అవగాహన పెంచుతాం. ఏలికపాములు నివారణ ప్రధాన లక్ష్యంగా పశువులకు మందులు వేయిస్తాం. శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

\- రాజగోపాలరావు, జేడీ, పశుసంవర్థక శాఖ, శ్రీకాకుళం

మూడు రోజుల తర్వాత..

- కొత్తపేట తీరానికి కొట్టుకొచ్చిన తరుణ్ మృతదేహం



తరుణ్ (ఫైల్)

8లో

వారు మారరంతే!

- 'మీ కోసం' కార్యక్రమానికి సంక్రాంతి ఎఫెక్ట్
- వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారుల గైర్హాజరు
- అర్జీదారుల్లో అసంతృప్తి

8లో

కోలాటం... ఆధ్యాత్మిక ఆనందం

- ఆకట్టుకుంటున్న తంగివానిపేట బృందం ప్రదర్శనలు

6లో



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పక్కన ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే శంకర్

అంబరాన్ని తాకేలా 'రథసప్తమి'

- సంబరాలు ఘనంగా నిర్వహించాలి: జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో అంబరాన్ని తాకేలా రథసప్తమి సంబరాలను నిర్వహించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. రథసప్తమిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు కార్యక్రమాల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి అధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ 'మూడు రోజుల పాటు నిర్వహించనున్న రథసప్తమి వేడుకల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నాం. తొలిరోజు 80 అడుగుల రోడ్డులో ఉదయం 7గంటలకు సామూహిక సూర్యనమస్కారాలతో వేడుకలు ప్రారంభమవుతాయి. అనంతరం మున్సిపల్ మైదానంలో వాలీబాల్, కర్రసాము, సంగిడీలు, ఎడ్లబండ్ల పోటీలు, వెయిట్ లిఫ్టింగ్ వంటి గ్రామీణ క్రీడలు నిర్వహిస్తాం. కలెక్టరేట్ సమీపాన డచ్ బిల్డింగ్ వద్ద హెలీకాప్టర్ టూరిజం ఏర్పాటు చేస్తాం. 80అడుగుల రోడ్డులో వివిధ రకాల స్టాల్స్, ఫుడ్ స్టాల్స్ అందుబాటులో ఉంటాయి. ఏడురోడ్ల కూడలి నుంచి అరసవల్లి ఆలయం వరకు ఘనంగా శోభాయాత్ర నిర్వహిస్తాం. 80 అడుగుల రోడ్డులో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి లేజర్ షో, డచ్ బిల్డింగ్ వద్ద క్రాకర్స్ షో ఉంటాయి. మూడు రోజులపాటు ఆదిత్యాలయంలో సూర్యయాగం జరుగుతుంది. ఆలయం వద్ద వివిధ దేవాలయాల మోడళ్లను ప్రదర్శిస్తాం. అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాల'ని తెలిపారు. సమావేశంలో డీఆర్వో వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, జిల్లా పర్యాటక శాఖాధికారి కె.నారాయణరావు, డీఎస్పీ వివేకానంద, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, అగ్నిమాపక అధికారి మోహన్‌రావు, డీపీవో కె.భారతి సౌజన్య, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జేఏ మౌలానా

మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కారం

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

7లో

- గృహ నిర్మాణ పనుల్లో జాప్యం
- పూర్తికాని మరుగుదొడ్లు, రహదారులు
- కానరాని కనీస మౌలిక వసతులు
- లబ్ధిదారులకు తప్పని ఇబ్బందులు

టిడ్కో.. ఎప్పుడో?



టిడ్కో గృహాలకు.. ప్రధాన రహదారి పనులు ఇలా..

పలాస, జనవరి 20(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల పనులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణానికి కొంతమేర పనులు సాగాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్ల పేరిట పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేశాయి. కాగా గతేడాది ఎన్నికల సమయంలో.. తాము అధి కారంలోకి వస్తే టిడ్కో ఇళ్లు పూర్తిచేసి.. లబ్ధిదారులకు అందజేస్తామని కూటమి నేతలు ప్రకటించారు. కానీ, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా.. పనుల్లో కదలిక లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా తమకు ఇళ్లు అప్పగిస్తారో.. లేదోనని అయోమయం చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

టీడీపీ ప్రభుత్వం(2014-2019 మధ్య).. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన- ఎన్టీయార్ గృహ నిర్మాణ పథకం (ఏహెచ్‌పీ) సంయుక్తంగా పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో 1,968 టిడ్కో గృహాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. అందులో 365 చదరపు అడుగుల గృహాలు 912, 300 చదరపు అడుగుల గృహాలు 816, 430 చదరపు అడుగుల గృహాలు 240 నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం అప్పట్లో రూ.115 కోట్లు విడుదల చేసింది. కాగా 2019 నాటికి 950 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గృహ నిర్మాణంపై నిర్లక్ష్యం వహించింది. ఏహెచ్‌పీ గృహాల కేటాయింపులో అవకతవకలు జరిగాయంటూ రివర్స్ టెండర్లు పిలుస్తామని చెప్పి పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేశాయి. ఇక్కడ టాటా నిర్మాణ సంస్థ గృహ నిర్మాణాన్ని చేపట్టింది. లాభాపేక్ష లేకుండా కేవలం అభివృద్ధిలో తాము భాగస్వాములవుతామని, వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి నిరుద్యోగులకు మంచి అవకాశాలు కల్పిస్తామని చెప్పింది. ప్రభుత్వ విధానం కారణంగా పనులు సగంలోనే నిలిపేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన మూడేళ్ల తరువాత టిడ్కో గృహాలను తామే నిర్మించి ఇస్తామని చెప్పింది. కొత్తగా పనులు చేపట్టడంతో పాటు గతంలో ఎంతవరకు నిర్మాణం జరిగాయో ఆ మేరకు లబ్ధిదారులకు గృహాలు ఇస్తామని నమ్మబలికింది. ఆ పని పూర్తి చేయలేక చేతులు ఎత్తేసింది. కాగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో గృహాలకు తామే లబ్ధిదారులతో ప్రారంభోత్సవాలు చేస్తామని కూటమి నేతలు గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రకటించారు. కాగా.. ఇప్పటివరకూ పనుల ఊసేలేదు. రహదారులు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం వంటి ప్రధాన సమస్య ఒక్కటీ పరిష్కారం కాలేదు. మరుగుదొడ్ల పనులు యథాతథంగా దర్శనమిస్తున్నాయి. ఇళ్లకు సామూహికంగా బిగించాల్సిన మీటరు బాక్స్‌లు ఆరుబయటే కనిపిస్తున్నాయి. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ గృహాలపై ఇచ్చిన రుణాలకు సంబంధించి బ్యాంకర్లు మాత్రం ప్రతినెలా వడ్డీతో సహా డబ్బులు కట్టించుకోవడంతో రెండింటికి చెడ్డ రేవడి అన్న చందంగా లబ్ధిదారుల పరిస్థితి మారింది. అద్దెగృహాల్లో వారు ఉంటూ అద్దెతోపాటు, లేని గృహాలకు ప్రతినెలా వడ్డీతో సహా అసలు కడుతూ తలకు మించిన భారాన్ని మోయాల్సి వస్తోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బ్యాంకర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తే కొంతభారం తమకు తప్పుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. కనీసం ఈ ఏడాదిలోనైనా నిర్మాణాలు చేపట్టి తమకు ఇళ్లు అప్పగించాలని కోరుతున్నారు. ఈ విషయమై నిర్మాణదారుల వద్ద ప్రస్తావించగా.. ఇంతవరకూ నగదు చెల్లించలేదని, తాము నిర్మాణాలు ఏ విధంగా చేపట్టగలమని ప్రశ్నిస్తున్నారు.



గృహసముదాయం వద్ద ఉత్సవ విగ్రహాలుగా మిగిలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు..

నెట్ ప్రాక్టీస్ పెరుగుతోంది!



- బాక్స్ నెట్ క్రికెట్‌పై ఆసక్తి
- ఉద్యోగులు, చిన్నారులకు ఆట విడుపు
- నిర్వాహకులకు ఆదాయం

● ఆరు సెంట్ల స్థలం ఉంటే చాలు..

బాక్స్ క్రికెట్ నెట్స్‌కు తక్కువలో ఆరు సెంట్ల స్థలం ఉంటే చాలు. 60 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పుతో వీటిని నిర్మించుకోవచ్చు. పది సెంట్ల స్థలంలో అయితే ఆదాయం చేకూర్చే చాయ్ పాయింట్, సాక్స్, మినీ రెస్టారెంట్‌తోపాటు బిలియర్డ్స్ వంటి ఇండోర్ క్రీడా వేదికలూ ఏర్పాటు చేసుకుంటున్నారు.



శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ నెట్

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 20(ఆంధ్రజ్యోతి):

ఒకప్పుడు ప్రధాన నగరాలకే పరిమితమైన బాక్స్ నెట్స్ ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా కేంద్రంతో పాటు మరికొన్ని పట్టణాల్లోనూ కనిపిస్తున్నాయి. నగరంలో వీటి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నగరాలు, పట్టణాల్లో పెద్ద మైదానాలు తగ్గుతూ వస్తుండడం... వీధులు ఇరుకుగా మారుతుండడం... ఉన్న మైదానాలు దూరంగా ఉండడం వంటి కారణాలతో క్రికెట్‌పై ఆసక్తి గల వారు బాక్స్ నెట్స్ వైపు మళ్లుతున్నారు. చిన్న చిన్న ఇళ్లలో బౌండరీ వాల్స్‌లో బ్యాట్, టెంపర్ బాల్‌తో చిన్నారులు, యువత దర్శనమిస్తుంటే.. వాటిని ఆదాయ వనరులుగా మలుచుకునేందుకు నిర్వాహకులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. బాక్స్ క్రికెట్ నెట్స్ ఏర్పాటు చేసుకుని... రాత్రి వేళల్లో ఫ్లడ్ లైట్స్ వెలుతురులో ఆడేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలో ఈ సంస్కృతి రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. రెండేళ్ల కిందట ఒకటి, రెండు ఉన్న బాక్స్ నెట్స్... నేడు నగరంలోని దాదాపు ప్రతి గల్లీలోనూ దర్శనమిస్తున్నాయి. బాక్స్ నెట్స్‌కు డిమాండ్‌ను బట్టి గంటకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు తీసుకుంటున్నారు. ఎక్కువగా వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వీటిపై ఆసక్తి చూపుతున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, చిన్నారులు సైతం బాక్స్ నెట్‌పై ఆసక్తి చూపుతున్నారు. నగరంలో సింహద్వారం, మాధవ మోటార్స్, జిల్లా పరిషత్, కలెక్టర్ ఆఫీస్, శాంతినగర్ కాలనీ, కొత్తరోడ్డు తదితర ప్రాంతాల్లో బాక్స్ నెట్స్ కనిపిస్తున్నాయి.



ఆడుతున్న విద్యార్థులు



కోలాటం ఆడుతున్న తంగివానిపేట మహిళలు

కోలాటం... ఆధ్యాత్మిక ఆనందం

● ఆకట్టుకుంటున్న తంగివానిపేట బృందం ● వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలతో గుర్తింపు

ఎచ్చెర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వారంతా గ్రామీణ ప్రాంత మహిళలు. అందులోనూ చాలా వరకూ నిరక్షరాస్యులు. కానీ కోలాటం ప్రదర్శనతో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. వారే ఎచ్చెర్ల మండలం జరజాం పంచాయతీ తంగివానిపేట గ్రామానికి చెందిన మహిళలు. జిల్లాలోనే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల్లో తమ కళా ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు.

అలరించాలని...

ఆధ్యాత్మిక ఉత్సవాల్లో మహిళల సందడి అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఏదో ఒక కళలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆలోచించారు ఆ మహిళలు. కోలాటంతో అందరినీ అలరించాలని నిర్ణయించారు. ఆ క్రమంలో తంగివానిపేట గ్రామానికి చెందిన 20 మంది మహిళలు బృందంగా ఏర్పడి కోలాటం నేర్చుకున్నారు.

పర్వదినాల్లో ప్రత్యేక ఆకర్షణ..

పర్వదినాల్లో ప్రత్యేక ఆకర్షణగా కోలాటం నిలుస్తుంది. మహిళంతా ఒకే రంగు దుస్తులు ధరించి... లయబద్ధంగా కోలాటం ఆడి... పాటలు పాడుతుంటే జనం ఆసక్తిగా వీక్షిస్తుంటారు. అంతరించిపోయే దశలో ఉన్న ఈ కళను బతికించేందుకు ప్రయత్నిస్తున్న వీరిని కళాభిమానులు అభినందించకుండా ఉండలేకపోతున్నారు.

మానసిక ప్రశాంతత..

కోలాటం ప్రదర్శనతో ఆధ్యాత్మిక ఆనందంతో పాటు, మానసిక ప్రశాంతత ఉంటుందని సాధకులు చెబుతున్నారు. రక్తపోటు, మధుమేహం, దీర్ఘకాలిక వ్యాధులు నియంత్రణలో ఉంటాయని..ఏకాగ్రత లభిస్తుందని అంటున్నారు. తమకు అందుతున్న ప్రోత్సాహాన్ని చూసి... మరింత మంది మహిళలు కోలాటం నేర్చుకోవడానికి ముందుకొస్తున్నారని చెబుతున్నారు.

తంగివానిపేట మహిళల ప్రత్యేకత..

తొలుత ఇక్కడి మహిళలు సరదాగా సాధన ప్రారంభించారు. ఆ తర్వాత ఎక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగినా... గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించినా... జాతీయ పర్వదినాలు, సంక్రాంతి, ఉగాది, విజయదశమి తదితర పండుగల్లో కోలాటం ప్రదర్శించడం ప్రారంభించారు. 2014లో తంగివానిపేట గ్రామంలో శ్రీ ఆనంద రామ భజన మండలి, అయోధ్య రామ భజన మండలి సభ్యులు 20 మంది బృందంగా ఏర్పడి కోలాటం నిర్వహణకు ముందుకొచ్చారు. అప్పటి నుంచి వీరు వెనుదిరిగి చూసుకోలేదు. ఇప్పటికే హరిద్వార్, హృషీకేష్, బద్రీనాథ్, హంపి, తిరుపతి తదితర ప్రాంతాల్లో కోలాటం ప్రదర్శించి... ప్రేక్షకుల మన్ననలు పొందారు. తిరుపతిలో దుర్గాభాయి వద్ద కోలాటం నేర్చుకున్నట్టు ఇక్కడి మహిళలు చెబుతున్నారు. ఈ బృందానికి తంగి లక్ష్మి, రామలక్ష్మి, జయమ్మ, నీలవేణిలు నాయకత్వం వహిస్తున్నారు. బట్న గోపాలరావు హార్మోనియం, బట్న మల్లేశ్వరరావు డోలక్‌తో వాద్య సహకారం అందిస్తున్నారు. రెడ్డి రమణ, రాజు పాటలు పాడుతూ అలరిస్తుండగా... మాజీ సర్పంచ్ తంగి మల్లేశ్వరరావు సారథ్యం వహిస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది..



కోలాటంతో ఆధ్యాత్మిక ఆనందం కలుగుతుంది. సుమారు పదేళ్లగా కోలాటం ప్రదర్శిస్తున్నాం. ఈ కళతో గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇది మరిన్ని ఆధ్యా త్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు స్ఫూర్తినిచ్చింది.

-తంగి లక్ష్మి, నిర్వాహకురాలు

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్

- జిల్లాలో నరసన్నపేట కేంద్రంలోనే నిర్వహణ
- పరీక్షలు రాయనున్న సుమారు 4 వేల మంది
- నిర్ణీత సమయానికి రెండు గంటల ముందే చేరుకోవాలి

నరసన్నపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ తరువాత ఐఐటీ, ఎన్ఐటీల్లో చేరేందుకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలు ఈ నెల 22 నుంచి 30 వరకు జిల్లాలో జరుగనున్నాయి. ఈ నెల 22, 23, 24 ,28, 29 తేదీల్లో రెండు షిఫ్టులలో పేపర్-1 (బీఈ, బీటెక్) ప్రవేశ పరీక్షలు జరుగనుండగా... 30న మధ్యాహ్నం పేపర్-2 బీఆర్క్ పరీక్ష జరగనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. పరీక్షలకు మూడు రోజుల ముందుగా కేంద్రం, సమయం తదితర వివరాలతో కూడిన అడ్మిట్ కార్డును విడుదల చేస్తారు. ఇలా 22 నుంచి 24వ తేదీ వరకు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో అడ్మిట్ కార్డులను జారీ చేశారు. ఇంకా 28, 29, 30 తేదీల్లో పరీక్షలు రాసే వారి కార్డులను విడుదల చేయాల్సి ఉంది. ఈ ఏడాది జిల్లాలో సుమారు 11వేల మంది అభ్యర్థులు జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో దాదాపు 60 శాతం మంది విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి తదితర పట్టణాల్లో పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో నరసన్నపేటలో మాత్రమే నిర్వహించే ఈ పరీక్షలకు సుమారు 4 వేల మంది వరకు అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉంది.

● కేంద్రానికి ఎలా చేరుకోవాలంటే...

నరసన్నపేట పట్టణంలో గొట్టిపల్లి అండర్ పాసేజ్ వంతెన పక్కనే ఉన్న కోర్ టెక్నాలజీలో జేఈఈ మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇచ్ఛాపురం, శ్రీకాకుళం నుంచి నరసన్నపేట పట్టణంలోకి వచ్చేవారు సీఎంఆర్ షాపింగ్ మాల్ పక్కన ఉన్న రోడ్డు ద్వారా జాతీయ రహదారి వద్దకు చేరుకోవాలి. అక్కడ కుడివైపున ఈ కేంద్రం కనిపిస్తుంది. జాతీయ రహదారి మీదుగా వచ్చేవారు జమ్ము జంక్షన్ వద్ద కిందకు దిగి... సర్వీసు రోడ్డులో గొట్టిపల్లి అండర్ పాసేజ్ వంతెన దగ్గరకు చేరుకుంటే ఈ కేంద్రం కనిపిస్తుంది.

2 గంటల ముందే...

● జేఈఈ మెయిన్స్ అడ్మిట్ కార్డులు పొందిన విద్యార్థులు అందులో ఎన్‌టీఏ పొందుపరచిన నియమ, నిబంధలను క్షుణ్ణంగా చదవాలి. పరీక్ష సమయానికి రెండు గంటల ముందుగానే కేంద్రాలకు చేరుకోవలసి ఉంటుంది.

● పేపర్ -1 ఇంజనీరింగ్ ప్రవేశపరీక్ష మొదటి షిఫ్టు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్టులో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం పరీక్షకు 7 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు ఒంటిగంటకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

● పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సాధారణ వస్త్రాలను ధరించాలి. కాళ్లకు సాధారణ చెప్పులు ధరించాలి. ఆడపిల్లలకు తలపై పిన్నులు, క్లిప్పులను అనుమతించరు. ఎటువంటి ఆభరణాలూ ధరించి పరీక్షకు వెళ్లరాదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. అబ్బాయిలు పెద్ద పెద్ద గుండీలు ఉన్న షర్టులు ధరించరాదు.

● ఎన్‌టీఏ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు కింద భాగంలో ఇచ్చిన ఒక బాక్సులో కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించాలి. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఫొటోనే అతికించాల్సి ఉంటుంది. మరో బాక్సులో విద్యార్థి ఎడమ చేతి వేలిముద్ర వేయాలి. పక్కన ఉన్న మూడో బాక్సులో పరీక్ష కేంద్రంలోకి వెళ్లాక ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేయాలి.

● విద్యార్థులు తమ వెంట అడ్మిట్ కార్డుతో పాటు అటెండెన్స్ షీట్‌పై అతికించేందుకు మరో పాస్‌పోర్ట్ సైజు ఫొటోను తెచ్చుకోవాలి. బయోమెట్రిక్ హాజరు నమోదు చేయనున్నారు.

● ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ కలర్ పాయింట్ పెన్ను తెచ్చుకోవాల్సి ఉంటుంది.

● దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఆధార్ లేదా పాన్ వంటివి ఒరిజినల్ కార్డులను విధిగా తీసుకువెళ్లాలి.



నరసనన్నపేట జాతీయ రహదారి పక్కనే బైపాస్ రోడ్డులో గల కోర్ టెక్నాలజీ కేంద్రం ఇదే..

దారీ లేదు.. నీరూ లేదు

- వైద్యానికి ఇప్పటికీ డోలీలే దిక్కు
- ఇదీ కె.తాళభద్ర వాసుల దుస్థితి



కలెక్టర్‌కు అర్జీని ఇచ్చేందుకు వచ్చిన కె.తాళభద్ర ప్రజలు



అధ్వానంగా ఉన్న రహదారి

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వారంతా నిరుపేద గిరిజనులు. తమ గ్రామానికి రోడ్డు, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రం వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఏళ్ల తరబడి కోరుతున్నారు. అయినా స్పందించే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... పలాస మండలం తర్లకోట పంచాయితీ కొటారింగి తాళభద్ర గ్రామానికి సరైన రహదారి లేదు. తాగేందుకు మంచినీరు కూడా లేక చెరువుల నీరు తాగి అనారోగ్యం పాలవుతున్నారు. పాము కాటుకు గురైనా... గర్భిణులకు ప్రసవం కోసమైనా... డోలీల్లో 8 కిలోమీటర్లు మోసుకొని పలాస ఆసుపత్రికి తీసుకు రావాల్సిందే. ఇలా వెళ్లే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన వారు ఎందరో. వర్షాకాలమైతే సైకిళ్లను భుజాలపై వేసుకుని నడక సాగించాల్సిందే. అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా... నాయకులను ఎన్నిసార్లు వేడుకున్నా ఫలితం మాత్రం శూన్యం. గ్రామంలో సుమారు 200 జనాభా ఉంటారు. అందులో చదువుకున్న యువత 30 మంది వరకు ఉన్నారు. కానీ వారు ఉన్నత చదువులకు గానీ, ఉద్యోగం కోసం కానీ ఊరు కదిలే పరిస్థితి లేదు. వ్యవసాయం లేదా కూలి పనులు చేసుకుంటూ పేదరికంలో బతుకులు ఈడుస్తున్నారు. గ్రామంలో 22 మంది బాలలు ఉన్నారు. వారు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలన్నా సరే... రాళ్ల దారిలో ఒక కిలోమీటరు దూరం నడవాల్సిందే. గ్రామీణ వైద్యులు కూడా ఆ ఊరి వైపు చూసే పరిస్థితి లేదు. ఆటోలు వెళ్లడానికి కూడా దారి లేదు. రెంటికోట నుంచి 2.5 కిలోమీటర్ల రోడ్డు వేస్తే గ్రామంలో పండించిన కూరగాయలు, సేకరించిన వస్తువులను అమ్ముకోవడానికి వీలు ఉంటుంది. కానీ ఆ దిశగా దృష్టి సారించే వారే లేరని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో కమ్యూనిటీ భవనం నిర్మించి...మధ్యలో వదిలేశారు. ఇది ఏ క్షణమైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. గ్రామానికి కనీస అవసరాలైన రోడ్డు, తాగునీటి సదుపాయం కల్పించాలని... పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

పదిలమే!

- మార్కెట్లో జోరుగా పది నాణెం వినియోగం
- ఫలితమిస్తున్న ఆర్బీఐ చర్యలు



వినియోగంలో ఉన్న పది నాణాలు

శ్రీకాకుళం/రాజాం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిన్న, మొన్నటి వరకు పది రూపాయల నాణెం చూస్తే జనం హడలిపోయేవారు. దాని వల్ల ఏదో ఇబ్బంది ఎదురవుతుందన్నంతగా బెదిరిపోయేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది. బహిరంగ మార్కెట్లో పది రూపాయల నాణెం మళ్లీ పరుగులు తీస్తోంది. గతంలో ఆర్బీఐ విడుదల చేసిన పది నాణాలు చాలా కాలంగా మార్కెట్లో చెలామణి కాలేదు. దీన్ని ఎవరికి ఇచ్చినా.. 'వద్దు' అనే పరిస్థితి ఉండేది. ఈ నాణాలకు చట్టబద్ధత ఉందని రిజర్వ్ బ్యాంక్ గతంలో ఎన్నిసార్లు ప్రకటనలు చేసినా వీటిని తీసుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపే వారు కాదు. ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇవి దాదాపుగా మూలకు చేరాయనే చెప్పాలి. అయితే ఇటీవల మార్కెట్లో చిల్లర సమస్య తీవ్రం కావడం... పది రూపాయల నోట్లు బాగా నలిగిపోయి.. కనుమరుగయ్యే పరిస్థితి నెలకొనడంతో ఆర్బీఐ తాజాగా పది నాణాలను భారీ స్థాయిలో విడుదల చేసింది. వ్యాపార లావాదేవీలలో వీటిని కచ్చితంగా తీసుకోవాల్సిందేనని ప్రకటించింది. బ్యాంకులు, ఇతర ఆర్థిక లావాదేవీలు నిర్వహించే సంస్థల వద్ద బోర్డులను ప్రదర్శించేలా చర్యలు చేపట్టింది. ఆ సంస్థల వద్ద ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేసింది. దీంతో ఈ నాణాలు మార్కెట్లో పరుగులు తీస్తున్నాయి. నాణాలు వచ్చిన తొలిరోజుల్లో పెద్ద సంఖ్యలో సేకరించి.. దాచుకున్న వారంతా తిరిగి వాటిని వినియోగంలోకి తెస్తున్నారు.



ఓ బ్యాంకులో ఏర్పాటు చేసిన బోర్డు

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉంచొద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 91 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కార్యాలయంలో ఒక అర్జీల మానిటరింగ్ అధికారిని, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేసి, రోజువారీ సమీక్ష చేయాలని ఆదేశించారు. అర్జీదారులకు కచ్చితమైన సమాచారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంత కావాలో చెప్పండి!



పాతపట్నం వద్ద చెక్‌పోస్టు

(ఐదో పేజీ తరువాయి)

మెళియాపుట్టి మీదుగా మహేంద్రతనయ నది పక్కన దారి గుండా ఒడిశా తరలిస్తున్నారు. పాతపట్నం వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసిన ప్రయోజనం కనిపించడం లేదు. మెళియాపుట్టి నుంచి అకరఖండి మీదుగా జంగలపాడు జంక్షన్‌కు తరలించి.. నిల్వలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆంధ్రాలో ఇసుక ఉచితంగా దొరుకుతున్నా.. ఒడిశాలో మాత్రం ట్రిప్పర్ లోడు రూ.20వేలకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ లోడు రూ.5,500 వరకు విక్రయిస్తూ.. జంగాలపాడు వరకూ రవాణా చేస్తున్నారు. అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించా లంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

నిఘా ఉంచాం..

ఆంధ్రా నుంచి ఒడిశాకు ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం. అవసరమైతే మెళియాపుట్టి-బిన్నాళ రోడ్డులో ఒక చెక్‌పోస్టు ఏర్పాటు చేయటానికి తహసీల్దార్‌తో మాట్లాడాం. ఒడిశాకు ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తాం.

-పిన్నింటి రమేష్‌బాబు, ఎస్ఐ, మెళియాపుట్టి

గుండెపోటుతో హోంగార్డు మృతి


నాగరాజు (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డుగా పనిచేస్తున్న బుక్కా నాగరాజు(44) సోమవారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందాడు. అతడికి భార్య పద్మజ, ఆరేళ్ల బాబు, మూడేళ్ల పాప ఉన్నారు. ఇటీవల జెమ్స్ ఆస్పత్రిలో ఎస్పీ ప్రోత్సాహంతో జిల్లాలోని పోలీసులందరికీ వైద్య పరీక్షలు చేయించగా.. నాగరాజుకి గుండె సంబంధిత సమస్య ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. అయితే వైద్య సేవలు పొందుతున్న నాగరాజు గుండెపోటుతో మరణించడం తోటి ఉద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. కాగా నాగరాజు మృతిపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

అతడి నేత్రాలు సజీవం


కోటేశ్వరరావు(ఫైల్)

ఎచ్చెర్ల/ అరసవల్లి/ శ్రీకాకుళం కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుశాలపురం సమీపంలోని వెంకటాపురంలో నివాసం ఉంటున్న పేడాడ కోటేశ్వరరావు (85) సోమవారం మృతిచెందారు. ఈయన నేత్రాలను దానం చేయాలనుకున్న వారి కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు సమాచారం అందించారు. దీంతో మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ పూతి సుజాత, సహాయకులు నంది ఉమాశంకర్ చేరుకుని మృతుడి కళ్ల నుంచి కార్నియాను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు. కోటేశ్వరరావు నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ సభ్యులు అభినందించారు. కాగా ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వారు 78426 99321 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

పలు కుటుంబాలకు పరామర్శ

ఆమదాలవలస, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని పలు కుటుంబాలను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం పరామర్శించారు. హడ్కో కాలనీకి చెందిన మేస్త్రీ అన్నెపు శ్రీరాములు, అక్కివలసకు చెందిన శిమ్మ అప్పారావు, కృష్ణాపురం గ్రామానికి చెందిన కూన చంద్రశేఖర్, అలవెల్లి శారద, పొన్నాడ గోవిందరాజులు, తిమ్మాపురం గ్రామానికి చెందిన శిమ్మా రాజారావు ఇటీవల మృతి చెందగా, ఆయా కుటుంబాలను పరామర్శించారు.

అభివృద్ధికి నిధులు మంజూరు

ఆమదాలవలస, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.1,84,18,656 మంజూరు చేసిందని నియోజకవర్గం టీడీపీ కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి 2020-21, 2021-22 సంవత్సరాల నిధులు ప్రభుత్వం విడుదల చేసినట్టు తెలిపారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపర్చడానికి, గార్బేజ్ కాంపాక్టర్ వాహనం, కాంపాక్టర్ బిన్స్ తదితర వాటి కోసం రూ.53,64,389, నీటి సరఫరా మెరుగుపర్చడానికి నాగావళి నదిలో కొత్తవలస వద్ద ఉన్న పంపుహౌస్‌కు 40 కేవీఏ జనరేటర్ కొనుగోలుకు, అలమాజీపేట వాటర్ పంపుహౌస్ అభివృద్ధికి, కొత్తవలస పంపుహౌస్ భవనం, ప్రహరీ నిర్మాణానికి రూ.27,21,311, పట్టణంలోని 15వ వార్డులో ఉన్న మోణింగి వారివీధి రోడ్డును తారురోడ్డు వేయడానికి రూ.39,90,000, అలాగే వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.63,42,956 మంజూరు చేసినట్టు తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

అరసవల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా చేస్తున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం ఉదయం అరసవల్లి మిల్లు జంక్షన్, అరసవల్లి రోడ్డు మార్గంలో జరుగుతున్న పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నాణ్యతలో రాజీ లేకుండా పనులను పూర్తి చేయాలన్నారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, మున్సిపల్ ఎంఈ, వన్ టౌన్ సీఐ, ట్రాఫిక్ సీఐ, ఎస్ఐ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ సందర్శన

ఇచ్ఛాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి సకాలంలో సేవలందించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డికి సూచించారు. సోమవారం సీహెచ్‌సీని సందర్శించిన ఆయన.. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఎందుకు రిఫర్ చేశారని, క్షతగాత్రులను వైద్య సేవలందించకపోవడానికి గల కారణాలు ఏంటని ప్రశ్నించారు. ఈయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ఉన్నారు.

పింఛన్‌దారుల సంక్షేమమే ధ్యేయం

పొందూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పొందూరు, జి.సిగడాం పంఛన్‌దారుల సంక్షేమమే లక్ష్యమని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు, పొందూరు, జి.సిగడాం మండలాల సంఘ అధ్యక్షులు అన్నారు. మండల కేంద్రంలోని పింఛన్‌దారుల కార్యాలయంలో సోమవారం నూతన కార్యవర్గం తొలి సమావేశం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి ఎం.సూర్య ప్రకాశరావు కోశాధికారి వి.దామోదరరావు పాల్గొన్నారు.

రీ సర్వే సక్రమంగా చేపట్టాలి

ఆమదాలవలస, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రైతులు సమక్షంలోనే రెవెన్యూ అధికారులు రీ సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం రామచంద్రాపురం పంచాయతీ పరిధి ఆనందపురం గ్రామంలో నిర్వహించిన రీసర్వే ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు నూక రాజు, నాయకులు గుజ్జల లక్ష్మణరావు, ఇప్పిలి సత్యనారాయణ, తహసీల్దార్ పి.రాంబాబు, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు వినియోగించుకోవాలి

రణస్థలం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఏడీ బి.దుర్గారావు అన్నారు. సోమవారం దేవారపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పశువులకు ఉచితంగా గర్భకోశవ్యాధులు నివారణ కార్యక్రమం చేపట్టారు. పశువులకు, దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. వ్యాధిగ్రస్త పశువుల రైతులకు మినరల్ మిక్చర్లు, లివర్ టానిక్స్ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్, చంద్రశేఖర్, గ్రామ పెద్దలు వెలిచేటి చిన్నమాళి, మీసాల శ్రీనివాసరావు, రెడ్డి శ్రీరాములు పాల్గొన్నారు.

సాగు నీరందించి ఆదుకోండి

● వంశధార కుడి ప్రధాన కాలువ రైతుల ఆవేదన


ఎండిపోయిన వరి పంట


ఆందోళనలో చెందుతున్న కొండవలస రైతులు

సరుబుజ్జిలి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అంది.. రెండో పంట పండించుకోవచ్చునుకున్న రైతుల ఆశలు నీరుగారుతున్నాయి. ఖరీఫ్ పూర్తికాగానే వంశధార అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ పలు గ్రామ సభలు, సమావేశాల్లో ఈ ఏడాది రబీ సాగుకు వంశధార నీరు అందించలేమని ప్రకటించారు. అయితే గత రెండు నెలల్లో ఏర్పడిన అల్పపీడనాలు, పెంగల్ తుఫాన్ ప్రభావంతో పరిస్థితులు అనుకూలించడంతో సుమారు 20 గ్రామాల్లో రైతులు రెండో పంట కింద వరిసాగు చేపట్టారు. వర్షాలతో అనుకూల వాతావరణం కనిపించడంతో వంశధార అధికారులు కూడా కుడి ప్రధాన కాలువ ద్వారా కొంతమేర నీరు విడుదల చేయడంతో రైతులు ఆశాభావంగా పంటపై దృష్టసారించారు. ప్రస్తుతం హిరమండలం వద్ద వంశధార జలాశయంలో నీరు పూర్తిస్థాయిలో లేకపోవడంతో కుడి ప్రధాన కాలువ నీరు లేక వెలవెలబోతుంది. దీంతో చివరి దశలో ఉన్న వరి మొనలు ఎండిపోవడమే కాకుండా పొలాలు కూడా పగళ్లు దేరిపోతున్నాయి. ఎల్ఎన్ పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాల్లో వరి పంట సాగు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కలుగుజేసుకోవాలి

ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ కలుగుజేసుకోవాలని కొండవలస గ్రామ సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావుతో పాటు కొంతమంది రైతులు కోరతున్నారు. వంశధార జలాశయం మాట ఎలా ఉన్నప్పటికీ గొట్టా బ్యారేజి నీటిలో కొద్దిపాటి నీటిని వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా విడుదల చేస్తే రైతులు పూర్తిస్థాయిలో నష్టపోకుండా కొంతమేర ఉపశమనం పొందవచ్చునని వారంతా కోరుతున్నారు.

ప్రతీ గ్రామానికి పక్కా రహదారి


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామానికి పక్కా రోడ్డు నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. సోమవారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సంతవురిటి నుంచి విజయరాంపురం, సంతవురిటి నుంచి సీతారాంపురం, టీడీ వలస నుంచి నక్కపేట గ్రామాలకు వెళ్లే బీటీ రహదారి నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, సంతవురిటి సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, సీతంపేట సర్పంచ్ గేదెల మల్లిబాబు, దవళపేట సర్పంచ్ వడిశ మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆదర్శ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే సర్పంచ్ ముద్దాడ గౌరీశ్వరరావును ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పరామరించారు. గౌరీశ్వరరావు తల్లి ముద్దాడ డొంకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

నగర సుందరీకరణ పనుల పరిశీలన

శ్రీకాకుళం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణలో భాగంగా పాలకొండ రోడ్‌లో జరుగుతున్న పనులను సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీ ప్రసాదరావు పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ పాలకొండ రోడ్‌లో ఉన్న డివైడర్ మధ్యలో మొక్కలు, లైటింగ్ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. నగరంలో ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో రాష్ట్ర పండగ చేస్తున్న క్రమంలో నగరాన్ని సుందరీకరణ చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

గ్రంథాలయాలు వినియోగించుకోవాలి


ఎర్రన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం ఉదయం గార గ్రంథాలయంలో ఎర్రన్న విద్యా దీవెన కింద కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అందచేసిన వివిధ పోటీ పరీక్ష పుస్తకాలను, బీరువాను అందజేశారు. అనంతరం కుమ్మరిపేట పాఠశాలను పరిశీలించి అక్కడ సమస్యలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసు నాయుడు, మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, కూటమి నాయకులు పాల్గొన్నారు. తొలుత ఎర్రన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాగునీటి వనరుల్లో నిర్మాణాలు చేపట్టొద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సాగునీటి వనరుల్లో ఎట్టి పరిస్థితుల్లో నిర్మాణాలు చేపట్ట వద్దని ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. కనిమెట్ట గ్రామంలో సోమవారం భూ రీ సర్వే ర్యాలీని ప్రారంభించి, అనంతరం నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షలు ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించారని, వీటిపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరుపుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్ రామానుజులు సర్పంచ్ బి.లక్ష్మి, ఎంపీటీసీ కె.లక్ష్మి, సచివాలయ కార్యదర్శి శ్రీనురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కారం

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా


శిక్షణలో పాల్గొన్న న్యాయవాదులు

గుజరాతీపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతె వివాదాలు పరిష్కారించుకోవచ్చని జిల్లా న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం అంశంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయ వివాదాలను త్వరితగతిన పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం ఒక మార్గమన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. జిల్లాలోని వివిధ బార్ అసోసియేషన్ల నుంచి ఎంపిక చేసిన పలువురు న్యాయవాదులు ఈ శిక్షణకు హాజరయ్యారు. జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ (ఎంసీపీసీ) సభ్యులు అనూజా సక్సేనా, వీణా రల్లి మాస్టర్ శిక్షకులుగా వ్యవహరించగా, న్యాయవాదులు పాల్గొన్నారు.

సత్ఫలితాలు సాధించాలి

గార, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏపీ గురుకుల పాఠశాలల సెక్రటరీ మస్తానయ్య అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన వమరవల్లిలోని బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో వినోదిని, ప్రిన్సిపాల్ చిట్టితల్లి, ఎస్ఎంసీ చైర్మన్ వై.కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిష్కారానికి చర్యలు

జి.సిగడాం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో సమస్యలు పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోనున్నట్టు తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వినతులను త్రిసభ్య కమిటీ పరిశీలించింది. ఎంపీడీవో జి.రామకృష్ణ, ఎస్ఐ మధుసూదనరావు ఉన్నారు.

రైతులకు ఆదాయం

పొందూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పశుసంపద ద్వారా రైతులు ఆదాయం పొందవచ్చని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పశుసంపదను వృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఈ నెల 20 నుంచి 31 వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాల పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పొందూరు పశువైద్యశాఖ ఏడీ బాలకృష్ణ, పశువైద్యులు పద్మ, సిబ్బంది ఉన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

సోంపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కొర్లాం నుంచి బారువ వైపు వచ్చే మలుపు వద్ద నిత్యమూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రదేశంలో హెచ్చరిక బోర్డును బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు, ఏఎస్ఐ కృష్ణ ఏర్పాటు చేశారు.

స్థల ఆక్రమణపై ఫిర్యాదు

పొందూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలతో మండల కేంద్రంలోని అత్యంత విలువైన స్థలాన్ని ఆక్రమించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై సోషల్‌క్లబ్ ప్రతినిధులు సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మండల కేంద్రం సర్వే నెంబరు 188 రికార్డుల్లో ప్రభుత్వ పోరంబోకుగా నమోదయింది. ఈ సర్వే నంబరులో మండల పరిషత్ కార్యాలయంతో పాటు సోషల్‌క్లబ్ భవనాలు ఉన్నాయి. 60 ఏళ్ల కిందట సోషల్‌క్లబ్ భవనం పోస్టుమార్టం కేంద్రంగా ఉండేది. తర్వాత ఈ భవనంలో సోషల్ క్లబ్ నడిచేది. పంచాయతీకి టాక్స్‌లు సోషల్‌క్లబ్ చెల్లించేది. సుమారు 19 సెంట్లలో ఉన్న ఈ క్లబ్ స్థలం ఖరీదు సుమారు రూ.3 కోట్లు వరకు ఉంటుంది. దీంతో ఈ స్థలంపై కొంతమంది కన్ను పడింది. 2023లో ఈ స్థలాన్ని సర్వే నెంబరు 187తో ఆరుగురు వ్యక్తులపేరుతో ఫేక్ పొజిషన్ సర్టిఫికెట్ సంపాదించిన ఒక వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలిసిన సోషల్ క్లబ్ ప్రతినిధులు కె.సాయికుమార్, ఎం.సుందరరావు, గుంటుకు జగన్నాథరావు, వి.రామచంద్రరావు తదితరులు పూర్తిస్థాయి ఆధారాలతో పొందూరు పంచాయతీ ఈవో మోహన్‌బాబుకు ఫిర్యాదు చేశారు. తప్పుడు పత్రాలతో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడ్డుకోవాలని కోరారు.

మా భూములు అమ్మేశారు.. న్యాయం చేయండి

● అధికారులను వేడుకున్న బాలకృష్ణాపురం గ్రామస్థులు


ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

ఇచ్ఛాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మా తాత ముత్తాతల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూములు కొంతమంది అమ్మేశారని, మాకు న్యాయం చేయాలని బాలకృష్ణాపురం గ్రామస్థులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎస్.వెంకటరావును సోమవారం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బతకల తులసయ్య, దర్గమ్మ, మహాలక్ష్మి, బానయ్య మాట్లాడుతూ.. తమకు చెందిన 4.65 ఎకరాల భూమి నూకాల దాలమ్మ పేరున పొరపాటున అడంగల్ వచ్చిందని, ఆమెకు మాయమాటలు చెప్పి గ్రామానికి చెందిన కొంతమంది విశాఖకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్మించేశారని తెలిపారు. వాళ్లు ఆ భూమిని చదును చేసేందుకు యంత్రాలు తీసుకురావడంతో విషయం బయటపడిందని, దీన్ని అడ్డుకుని తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దీనిపై రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇరువర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేశామని. రెవెన్యూ అధికారుల విచారణ పూర్తయ్యేవరకు ఎవరూ ఆ భూమిపైకి వెళ్లొద్దని సూచించారు.

సర్వే పక్కాగా చేపట్టాలి : డీఎంహెచ్‌వో


జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాల మురళీకృష్ణ

అరసవల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): లెప్రసీ కేసుల నిర్ధారణ సర్వే పక్కాగా చేపట్టాలని డీఎంహెచ్‌వో బాల మురళీకృష్ణ పిలుపునిచ్చారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్సిడిసి)-2025 కార్యక్రమాన్ని ఆయన డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2 వరకు 14 రోజుల పాటు లెప్రసీపై సర్వే జరుగుతుందని, ఈ సర్వేలో సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రతీ ఇంటిని సందర్శించి వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో శ్రీకాంత్, డాక్టర్ మేరీ కేథరిన్, డీపీఎంవో వాన సురేష్‌కుమార్, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గోనిపాడు గ్రామసభ రసాభాస


అధికారులను ప్రశ్నిస్తున్న మాజీ సర్పంచ్ తిరుపతిరావు

సరుబుజ్జిలి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గోనెపాడు గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులపై సోమవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామంలో డ్రైనేజీలతో కూడిన సీసీ రహదారులు నిర్మాణం చేపట్టడానికి రూ.44.40 లక్షలు మంజూరు చేసి ఎమ్మెల్యే కూన రవికుమార్.. ఇటీవల శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ, ఎంపీటీసీ మెట్ట రాము, టీడీపీ నాయకుడు సీపాన రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నడుమ ఇటీవల కొన్ని పనులు పూర్తి చేశారు. అయితే ప్రధాన వీధిలో కొన్ని గృహాల వద్ద కొంతమేర నిర్మాణాలు తొలగించాల్సి ఉంది. దీనిపై ఇటీవల సర్వే నిర్వహించగా.. ఆ వీధిలోని కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకున్నారు. దీంతో గత వారంరోజులుగా ఆ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గతంలో పోలీసు రికార్డుల్లో అతి సమస్యాత్మక గ్రామంగా ఈ గ్రామానికి గుర్తింపు ఉండడంతో మళ్లీ ఏమి జరుగుతుందోనని అటు పోలీసులు, ఇటు అధికారులతో పాటు గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మండల పంచాయతీ అధికారి బొడ్డేపల్లి రామారావు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి ఇరు వర్గాలతో గ్రామసభ నిర్వహించారు. అయినా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు వాగ్వావాదం చేసుకుంటూ ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో ఎస్ఐ బి.హైమావతి అప్రమత్తమై సిబ్బందితో ఇరువర్గాలను అదుపు చేశారు. దీంతో చేసేదేమీలేక ప్రధాన వీధి రోడ్డు పనులపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేక అధికారులు గ్రామసభను ముగించేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

● కలెక్టరేట్ గేట్ వద్ద పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన


కలెక్టరేట్ గేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలని, 2019 పీఆర్సీ అమలు చేయాలని, 62 ఏళ్ల పదవీ విరమణ వర్తించేలా జీవో ఇవ్వాలని కోరుతూ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (ఏపీసీఎస్) ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ప్రధాన గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ.. 2019 తర్వాత చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, జీవో 36 అమలు చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలను ఇన్‌కమ్ టాక్స్ పరిధిలో నుంచి తప్పించాలని, గ్రాట్యూటీని రూ.2లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే నెల 10 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆదినారాయణమూర్తి, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రంగనాథ్, జిల్లా అధ్యక్షుడు లోలుగు మోహనరావు, ప్రధాన కార్యదర్శి బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రవల్లిక

బూర్జ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఎం.ప్రవల్లిక సూచించారు. కొల్లివలస సమీపంలో చేపట్టిన తనిఖీల్లో వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనదారులు విధిగా తమ వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● ఒకరి పరిస్థితి విషమం



నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్‌లో) హరీష్ (ఫైల్)

కంచిలి/సోంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జలంత్రకోట కూడలి వద్ద జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సోంపేట మండలం బారువ గ్రామానికి చెందిన హరీష్‌కుమార్ పాణిగ్రాహి(31) మృతి చెందగా, అనిల్ కుమార్ పాణిగ్రాహి తీవ్రంగా గాయపడ్డాడు. కంచిలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హరీష్ కుమార్ తన స్నేహితుడికి తీసుకువచ్చేందుకు ఆదివారం రాత్రి ఒంటి గంట సమయంలో కారులో వరుసకు సోదరుడైన అనిల్ కుమార్‌తో కలిసి పలాస రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి ముగ్గురూ కలిసి కంచిలి వెళ్లి.. తన స్నేహితుడ్ని కంచిలిలో దిగబెట్టి సోమవారం ఉదయం 5గంటల ప్రాంతంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. కంచిలి గ్రామం నుంచి జాతీయ రహదారిపైకి వచ్చిన హరీష్ పొగమంచు వల్ల రహదారిని గుర్తించలేక బారువ వైపు రాంగ్ రూట్‌లోకి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని గమనించక బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న హరీష్ అక్కడికక్కడే మృతి చెందగా.. అనిల్ తీవ్రంగా గాయ పడ్డాడు. అతడిని హైవే అంబులెన్స్‌లో సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం ఆసుపత్రికి.. అక్కడి నుంచి విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా హరీష్‌కి తల్లి రోజా, సోదరి, సోదరుడు ఉన్నారు. తండ్రి చిన్నప్పుడే ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. హరీష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా పది రోజుల కిందట స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం హైదరాబాద్ వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోగా.. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు రోజుల తర్వాత..

● కొత్తపేట తీరానికి కొట్టుకు వచ్చిన తరుణ్ మృతదేహం

వ.ప్రుకొత్తూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల నేపథ్యంలో శుక్రవారం వజ్రపుకొత్తూరు తీరంలో సముద్ర స్నానానికి దిగి అలల ఉధృతికి గల్లంతైన జంగం తరుణ్ (16) మృతదేహం సోమవారం మధ్యాహ్నం కొత్తపేట తీరానికి కొట్టుకువచ్చింది. తరుణ్ ఆచూకీ కోసం మూడు రోజుల పాటు వివిధ గ్రామాల్లోని తీరప్రాంతాల్లో ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యంలో సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. అయినా అతడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో తరుణ్ బతికే ఉంటాడని ఆ కుటుంబ సభ్యులు భావించారు. అయితే మృతదేహం కొట్టుకువచ్చినట్లు సమాచారం అందు కున్న ఎస్ఐ ఆ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తరుణ్ మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఆ తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది.

పోలీసుల అదుపులో అనుమానితుడు?

● వివాహిత హత్య కేసు ఛేదించే దిశగా దర్యాప్తు ముమ్మరం



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూ కాలనీ లోని ఓ ఇంట్లో మహిళ హత్య కేసును ఛేదించే దిశగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆదివారం నగర వాసులను ఉలిక్కిపడేలా చేసిన ఈ ఘటనలో అనుమానితుడ్ని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు అయా వర్గాలు ద్వారా తెలుస్తోంది. పొందూరు మండలంలో ఓ గ్రామానికి చెంది వివాహితతో శ్రీకాకుళం నగరానికి చెందిన శరత్‌కుమార్‌కు కొన్నాళ్లుగా పరిచయం ఏర్పడగా.. ఆమె తరచూ అతడి ఇంటికి వెళ్తున్నట్టు దర్యాప్తులో పోలీసులు గుర్తించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే శనివారం శరత్ ఉంటున్న ఇంటికి వెళ్లిన ఆమె హత్యకు గురైందని పోలీసులు భావిస్తున్నారు. సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన ఆధారాలను సోమవారం పోలీసులు సేకరించారు. కాగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం అర్ధరాత్రి దాటాక హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద, టూటౌన్ సీఐ ఈశ్వరరావుతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

దర్యాప్తు ముమ్మరం

వివాహిత హత్య కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్న శరత్ కుమార్ పోలీసులు విచారిస్తున్నారు. హత్య జరిగిన తర్వాత తన స్నేహితుడ్ని కలిసేందుకు వెళ్లాడని, అతడికి ఇవ్వాల్సిన కొంత మొత్తాన్ని ఇవ్వడంతో పాటు అతడితో చాలాసేపు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే ఆదివారం అర్ధరాత్రి శరత్ స్నేహితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. తనకు ఇవ్వాల్సి కొంత మొత్తాన్ని శరత్ ఇచ్చినట్టు పోలీసులకు చెప్పాడని సమాచారం. దీంతో శరత్ కోసం వెతుకుతున్న పోలీ సులకు.. శ్రీకాకుళం నగర శివారు ప్రాంతంలో పట్టుబడినట్టు విశ్వసనీయ సమాచారం. దీనిపై టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావును వివరణ కోరగా.. శరత్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిపారు. కేవలం డబ్బుల కోసమే ఆమెను హత్య చేసినట్టు శరత్ అంగీకరించినట్టు సమాచారం. అయితే హత్యకు గురైన వివాహిత ఒంటిపై సుమారు 30 తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్టు ఆమె భర్త ఫిర్యాదులో పేర్కొనడంతో.. ఆ దిశగా కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్టు సమాచారం.

వ్యక్తిపై దాడి

పాతపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక దువ్వారి వీధికి చెందిన పెద్దింటి తిరు పతిరావుపై గుర్తుతెలియని వ్యక్తి సోమవారం వేకువ జామున కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో ఒక్కసారి గ్రామంలో కలకలం రేగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తిరుపతిరావు, భార్య, కుమారుడితో కలిసి ఇంట్లో ఉంటున్నారు. సోమవారం గ్రామంలోని శ్రీనీలకంఠేశ్వరుని ఆలయానికి వెళ్లేందుకు కుటుంబ సభ్యులు వేకువజామున స్నానాలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈలోగా ఇంటి పైనుంచి ఓ వ్యక్తి ఇంటిలో చొరబడి నిద్రలో ఉన్న తిరుపతిరావును చాకుతో మెడ వద్ద కోసే ప్రయత్నం చేశాడు. మెలకువ వచ్చిన తిరుపతిరావు ప్రతిఘ టించాడు. అయినా సదరు దుండగుడు చాకుతో మెడ వద్ద కోసే ప్రయత్నం కొనసాగించాడు. నిందితుడు ముఖం గుర్తించకుండా ముసుగు వేసుకుని ఉన్నాడు. లుంగీ, షర్టు ధరించి ఉన్నాడు. ఈ పెనుగులాట, దాడిలో తిరుప తిరావు రెండు చేతులకు గాయాలయ్యాయి. తన ప్రయత్నం విఫలమవుతోందని గ్రహించి సదరు వ్యక్తి ఇంటి మధ్య ఉన్న మెట్ల గుండా పైకి వెళ్లి తప్పించుకున్నాడు. గాయపడిన తిరుపతిరావు ద్విచక్రవాహనంపై సీహెచ్‌సీకి వెళ్లారు. వెంటనే సమాచారాన్ని పోలీసులకు తెలుపగా సీఐ వి.రామారావు సీహెచ్‌సీకి చేరుకుని వాంగ్మూలం తీసుకున్నారు. ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. అయితే ఈ దాడి రాజకీయకక్షలతోనే చేసి ఉంటారని బాధితుడి కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

వారు మారరంతే..!

● 'మీకోసం' కార్యక్రమానికి సంక్రాంతి ఎఫెక్ట్
● వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారుల గైర్హాజరు
● అసంతృప్తి వ్యక్తంచేస్తున్న అర్జీదారులు



సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులు వీరే..

టెక్కలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయిలో ప్రతి సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న 'మీకోసం' కార్యక్రమానికి సంక్రాంతి ఎఫెక్ట్ కనిపించింది. సుమారు 33 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా 15 శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మరికొన్ని శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బందిని పంపి మమ అనిపించారు. దీంతో ఆయా శాఖల సమస్య లపై ప్రజలు ఇచ్చే విన్నపాలు పరిష్కారానికి నోచుకోలే దన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హౌసింగ్ విభాగం ఈఈ, డీఈఈలకు బదులు ఏఈ హాజరై అన్ని సంతకం పెట్టడం విశేషం. డివిజన్ స్థాయి గ్రీవెన్స్‌కు డీఎస్పీ, పంచాయతీరాజ్ ఈఈ, ఐటీడీఏ నుంచి ఏటీడబ్ల్యూవో, వెనుకబడిన తరగతుల శాఖ నుంచి సహాయ సంక్షేమాధికారి, పశుసంవర్ధకశాఖ ఏడీ, ఉప విద్యాశాఖాధికారి, అటవీశాఖ అధికారి, లీడ్‌బ్యాంక్ మేనేజర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఈపీడీసీఎల్ డీఈఈ, ఎన్ఆర్ఈజీఎస్, రెవెన్యూ, మండలపరిషత్ తదితర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి, వ్యవసాయశాఖ నుంచి ఇద్దరు కింది స్థాయి ఉద్యోగులను పంపించారు. దీంతో మీకోసం స్పందన గ్రీవెన్స్‌కు సంక్రాంతి పూర్తయినా పూర్తిస్థాయి హాజరు లేకపోవడంపై విమర్శలు వినిపించాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధికారులు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అర్జీదారులు కోరుతున్నారు. దీనిపై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తిని వివరణ కోరగా గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

ఈ దివ్యాంగుడి మొర ఆలకించేదెవరు?



టెక్కలి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఈయన పేరు ఎలిమెట్టి అప్పన్న. టెక్కలి పట్టణం సర్వ మంగళ వీధి. ఐదేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో ఎడమకాలు పూర్తిగా పోగొట్టుకున్నాడు. చేతికర్రలు పట్టుకుంటేనే గాని అడుగు బయటకు వేయలేని స్థితి. ఈయన ఏడాది కిందట గ్రీవెన్స్‌లో బ్యాటరీ బండి కోసం అర్జీ పెట్టుకున్నాడు. అయితే నేటికీ ఆ అర్జీకి మోక్షం కలగలేదు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి తాను పెట్టుకున్న అర్జీ పై అధికారులను ప్రశ్నించినా వారి నుంచి సమాధానం కరువవడంతో నిరాశగా వెనుదిరిగాడు. అలాగే పాత నౌపడా బీసీ కాలనీలో తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని, రెండు నెలల నుంచి అర్జీలిస్తున్నా అధికారులు స్పందించడం లేదని అంబీరు శంకరరావు మరో వినతిని అందించాడు.

నిబంధనలు పాటించాలి



వాహనదారులతో మాట్లాడుతున్న ఎంవీఐ

వజ్రపుకొత్తూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలని పలాస ఎంవీఐ శ్రీనివాసరావు అన్నారు. భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం బెండిగేటు జంక్షన్ వద్ద ఆటో యజమానులు, డ్రైవర్లు, ద్విచక్రవాహనచోదకులకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవ గాహన కలిగించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు, మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రాణాపాయం తెచ్చుకోవద్దని హితవు పలికారు.

పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

పలాస, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం సదరు పనులను పరిశీలించారు. 12, 18, 20 వార్డుల్లో తొలుత ఈ కార్యక్రమం నిర్వహించారు. పద్మనాభపురం డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త నిల్వలను పొగు చేసి ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచారు. ఇంటింటా చెత్త సేకరణకు ప్రత్యేకంగా టీమ్ ఏర్పాటు చేశామన్నారు.

మా ఖాతాల్లో నగదు ఎలా జమ చేశారు?

● ఖంగుతిన్న డ్వాక్రా గ్రూపు సభ్యులు

టెక్కలి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మాకు తెలియకుండా మా డ్వాక్రా ఖాతాలో రూ.17.96 లక్షలు ఎలా జమచేశారని, దీనికి వడ్డీ ఎలా కడతామని కొండభీంపురం గ్రామానికి చెందిన ఓ డ్వాక్రా గ్రూపు సభ్యులు ప్రశ్నించారు. వివరాలిలా ఉన్నాయి.. ఎటువంటి సమాచారం లేకుండా డ్వాక్రా గ్రూపు ఖాతాలో సదరు మొత్తం జమ అయ్యింది. సోమవారం ఆ డ్వాక్రా గ్రూపు ప్రతినిధులు ఎప్పటిలాగే పొదుపు కట్టేందుకు వెళ్లగా మీరు వాడుకున్న రూ.17.96లక్షలకు కొంత మొత్తం చెల్లించాలని బ్యాంకు సిబ్బంది కోరారు. దీంతో వారు ఖంగుతిన్నారు. మాకు తెలియకుండా ఎలా నగదు జమ చేశారని ఆవేదన వ్యక్తంచేస్తూ వెలుగుశాఖ అధికారుల వద్ద ప్రస్తావించారు. సీఎఫ్‌వో తీర్మానం లేకుండా ఖాతాలో రూ.17.96 లక్షలు ఎలా జమ అయ్యాయని వెలుగు ఏపీఎం ఉమారాణిని ప్రశ్నించారు. దీంతో వెలుగు శాఖ అధికారులు తేరుకుని తప్పిదం జరిగిందని నిర్ధారించుకుని సదరు డ్వాక్రా సంఘం ప్రతినిధులను ఒప్పించి వారి నుంచి తీర్మానం, డాక్యుమెంట్లు తీసుకుని సంబంధిత బ్యాంకుకు అందజేశారు.

శ్మశాన వాటికకు రోడ్డు నిర్మాణానికి కృషి



రోడ్డును పరిశీలిస్తున్న ఏపీటీపీసీ చైర్మన్ బాబూరావు

పలాస, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పెసరపాడు గ్రామంలో శ్మశాన వాటికకు సరైన రహదారి లేదని, ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారంతో రోడ్డు సదుపాయం కల్పిస్తామని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం శ్మశానవాటిక రహదారి పరిశీలించారు. స్థానికులు ఈ సమస్యను తన దృష్టికి తీసుకురాగా పరిశీలన చేశానన్నారు. మాజీ కౌన్సిలర్ సంపతి రావు ధనుంజయ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కామేశ్వరిపేటలో రైలు హాల్ట్ కోసం పరిశీలన



మాట్లాడుతున్న ఈస్ట్‌కోస్టు రైల్వే అధికారులు

నరసన్నపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నదీతీర గ్రామాలకు రైల్వే సదుపాయం కల్పించేందుకు గాను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సూచనల మేరకు ఈస్ట్‌కోస్టు రైల్వే అధికారులు సోమవారం కామేశ్వరిపేటను సందర్శించి స్థానికులతో మాట్లాడారు. కామేశ్వరిపేటలో పలు పాసింజర్ రైళ్లు నిలుపుదల చేసేందుకు సాధ్యాసాధ్యాలను వారు పరిశీలించారు. ఈ ప్రాంతం ఆక్యుపెన్సీ, సిగ్నల్ వ్యవస్థ తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కమర్షియల్ అధికారి గణేష్ సాహు, సిగ్నల్, ట్రాక్, సర్వే సాంకేతిక బృంద సభ్యులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి

మెళియాపుట్టి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేకుండా ఇన్‌పుట్ సర్వే చేపట్టాలని జిల్లా గణాంకాల ఏడీ రవిప్రసాద్ తెలిపారు. సోమవారం కుడ్డబ గ్రామంలో సర్వేని పరిశీలించారు. గతంలో జరిగిన తప్పిదాలు కనిపించకుండా సర్వే నిర్వహించాలన్నారు. జోడూరులో మూతపడిన జీడి పరిశ్రమను, తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. మండలానికి సంబంధించి గణాంకాలన్నీ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపగణంకాల అధికారి కాశీప్రసాద్ పండా, డివిజనల్ ఉపగణంకాల అధికారి పీసీ నందా, మండల గణంకాల అధికారి బీజీ మనోహర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

మెళియాపుట్టి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆదివాసీ చైతన్య వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ బి.పాపారావును కలిసి వినతిపత్రం అందించారు. 2009లో గ్రామం నుంచి కాలువకు అవసరమైన భూముల్లో 45 ఇళ్ల కాలువలో పడ్డాయని, అయితే రెండిళ్లకు మాత్రమే నష్టపరిహారం అందించారని, మిగిలిన ఇళ్లకు ఇవ్వలేదని అయన దృష్టికి తీసుకువెళ్లారు. పరిహారం ఇచ్చిన తరువాతే పనులు ప్రారంభించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గిరిజన సంఘం నాయకులు సరవర చొక్కారావు, జన్ని కూర్మారావు, ధర్మారావు, రాజు, సూరయ్య, ఆనందరావు, రామారావు తదితరులున్నారు.

ఐదు రోజుల్లోగా తాగునీటి సమస్య పరిష్కారం



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

హిరమండలం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హిరమండలంలోని చిన్నకోరాడ వీధిలో తాగునీటి సమస్యను ఐదు రోజుల్లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సీహెచ్ వెంకట అప్పలనాయుడు అన్నారు. జల్‌జీవన్ మిషన్ పనుల కారణంగా మూడు నెలలుగా రక్షిత నీటి పథకం కొళాయిల నుంచి తాగునీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానికులు ఆదివారం మహిళలు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యూ ఎస్, పంచాయతీ అధికారులు సోమవారం వీధిలో చేపడుతున్న జల్‌జీవన్ పనులు, కొళాయి పైప్ లైన్లను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కొత్త పైపు లైన్ల ద్వారా నీరు రాకపోతే పాత పైపులైన్లు మరమ్మతులు చేసి నీటిని అందించేందుకు కృషి చేస్తా మని ఈఓ హరికృష్ణ తెలిపారు. వారితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సాగర్ ఉన్నారు.

జీవనోపాధి మెరుగుపరిచేందుకు కృషి

కాశీబుగ్గ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని ఫిష్‌కాన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీరామమూర్తి, సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజా రావు అన్నారు. సోమవారం కాశీబుగ్గలో ఫిష్‌కాన్ క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమ స్యలపై ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. షిఫింగ్ హార్బర్లు, చేపల స్టోరేజీ ప్లాంట్‌లు, మెడికల్ కిట్, లైటింగ్, ఫోన్ సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫిష్‌కాన్ సభ్యులు రాజశేఖర్, ఆనంద్, రామకృష్ణ, నరసింహులు, దాసు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరా లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. సోమవారం మబగాంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూగజీవాలకు వైద్య చేయించడం ఎంతో అవసరమన్నారు. నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలపై అవగాహన కలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం

పోలాకి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి పంచాయతీ జనావానిపేటకి చెందిన జనార్దనరావు మృతి చెందగా ఆయన కుమార్తె వివాహానికి దీర్ఘాసి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న సహచరులు సాయమందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఇంటికి వెళ్లి రూ.30 వేల పోస్టల్ డిపాజిట్, కుమార్తెకు రూ.25 వేల బంగారు ఆభరణం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జయవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి అభినందన

టెక్కలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనిక శాస్త్ర అధ్యాపకుడు బేతల సతీష్‌కుమార్ ఇండియన్ పేటెంట్ హక్కును పొందగలగడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అన్నారు. బల్క్‌డ్రగ్ పదార్థాలతో సోనీడిగిబ్ దాని సేంద్రియ మలినాలను కచ్చితంగా లెక్కించేందుకు అధునాతన సాఫ్ట్‌వేర్ అయిన క్వాలిటీబై డిజైన్ ఉపయోగించి అల్ట్రా పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ సహాయక పద్ధతిని సతీష్‌కుమార్ అభివృద్ధి పరిచారు. ఇందుకు గాను అయన ఇండియన్ పేటెంట్ హక్కును పొందగలిగారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు అయనను అభినందించారు.

దాడి కేసులో ఆరుగురి అరెస్టు

నందిగాం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నందిగాం ఎస్సీ కాలనీలో ఆదివారం జరిగిన దాడి కేసుకు సంబంధించి ఒక వర్గానికి చెందిన ఆరుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుపై పది మందిపై కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు విదితమే. దీనికి సంబంధించి ఒక వర్గానికి చెందిన జడ్యాడ జయరాంతో పాటు మరో ఐదుగురిని అరెస్టుచేసి టెక్కలి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

మాకివలసలో ఇద్దరు..

నరసన్నపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మాకివలస గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన తండ్యాల రమణ వద్ద 13 మద్యం సీసాలు, బంటుపల్లి శ్రీను వద్ద 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఎచ్చెర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సనపల వానిపేట జాతీయ రహదారి పక్కన ఈ నెల 12న అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, సుమారు 55 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. ఈ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే 63099 90853 ఫోన్‌లో గాని, నేరుగా పోలీసు స్టేషన్‌లో గాని సంప్రదించాలని కోరారు.

తల్లికి అంత్యక్రియలు చేసిన కుమార్తె



తల్లి అంత్యక్రియలు నిర్వహిస్తున్న రాళ్లపాటి బుడ్డెమ్మ

కోటబొమ్మాళి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్న హరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన కల్లేపల్లి రెడ్డమ్మ సోమవారం మృతి చెందగా కుమార్తె రాళ్లపాటి బుడ్డెమ్మ అంత్యక్రియలు చేసింది. వివరాలిలా ఉన్నాయి.. రెడ్డమ్మ భర్త పాపయ్య, బుడ్డమ్మ భర్త కూడా కొన్నేళ్ల కిందట మృతి చెందారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలైన తల్లికి సపర్యలు చేసుకుంటూ ఉంటోంది. అయితే కొద్ది రోజులుగా తల్లి రెడ్డమ్మ అనారోగ్యంతో మంచాన పడి సోమవారం మృతి చెందింది. మరో దిక్కులేక కుల పెద్దలైన పట్నం రాము, పట్నాల భాస్కరరావు సహకారంతో కుమార్తె బుడ్డెమ్మ తల్లికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు చేశారు.

10 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

పలాసరూరల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం గ్రామంలో సోమ వారం 10లీటర్ల సారాతో బాలకృష్ణ అనే వ్యక్తిని పట్టుకున్నట్లు కాశీబుగ్గ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ కె.మల్లికార్జునరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు గ్రామంలో సిబ్బందితో దాడి చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సారా అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

రేపు మెగా రక్తదాన శిబిరం

పలాసరూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 29వ వర్ధంతి సందర్భంగా బుధవారం గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ (గ్లో) ఆధ్వ ర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహి స్తున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతంచేయాలని ఆమె కోరారు.

నేడు మండల సమావేశం

వ.ప్రుకొత్తూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహి స్తున్నట్లు ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమా వేశానికి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

జలుమూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటింట చేపడుతున్న ఎల్సీడీసీ సర్వే పారదర్శకంగా చేపట్టాలని జలుమూరు వైద్యాధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. చల్లవానిపేటలో చేపడుతున్న సర్వేని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 20 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఈ సర్వే గ్రామాల్లో నిర్వహించాలన్నారు. రోజుకు 20 ఇళ్ల వంతున సర్వే చేసి ఎవరికైనా అనుమానిత మచ్చలు కనిపిస్తే సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారికి సమాచారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పద్మావతి, ఆరోగ్యవిస్తరణాధికారి చిన్నరాజులు, హెల్త్ అసిస్టెంట్ చిన్నారావు, ఏఎన్ఎంలు, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణకు చర్యలు

పోలాకి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించి వాటి నివారణకు కృషి చేస్తున్నట్లు జిల్లా రీసెర్చ్ విభాగ ప్రతినిధి, ఆరోగ్యకేంద్ర విస్తరణాధికారి నల్లి రవికుమార్ తెలిపారు. సోమవారం ఎల్‌సీడీసీ సర్వేని ప్రారంభించారు. 14 రోజుల పాటు గ్రామాల్లో ఈ సర్వే చేపట్టను న్నామన్నారు. కార్యక్రమంలో డా. శ్రీనాథ్, మంగంశేఖర్‌బాబు, బరాటం లక్ష్మీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ శిబిరాలు

హిరమండలం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నుంచి 24వ తేదీ వరకు ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కాశీప్రసాదరావు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించు ఈ కార్యక్రమంలో 0 నుంచి 6 సంవత్సరాల వయసున్న పిల్లలకు ఆధార్ నమోదు చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీజీకే మూర్తి మృతి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నేత వీజీకే మూర్తి మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శిర్ల ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో మూర్తి సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నిమ్మక అప్పన్న, సింహాచలం, కృష్ణ, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

కంచిలి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తలతంపర జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం సీసాలను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. సూదిపుట్టుగ గ్రామానికి చెందిన పితాంబర్ దొళాయిను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.